# గర్భ నిరోధక మాత్రలు వికటించి మృతి


రేణుక(ఫైల్)

చేర్యాల, అక్టోబర్ 1: మండలంలోని వీరన్నపేట గ్రామానికి చెందిన జంగా రేణుక(30) గర్భ నిరోధక మాత్రలు వికటించి మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. రేణుక, కనకయ్య దంపతులకు ఇద్దరు కుమార్తెలు. రేణుక ఇటీవల గర్భం దాల్చడంతో పేదరికంలో ఉన్న దంపతులు మూడో సంతానం వద్దని నిర్ణయించుకున్నారు. మండలంలోని చుంచనకోట గ్రామంలోని ఓ ఆర్ఎంపీని కలిసి సమస్య పరిష్కరించాలని కోరడంతో ఆయన గర్భనిరోధక మాత్రలు వేసుకోవాలని సూచించారు. దీంతో చేర్యాల పట్టణంలోని ఓ మెడికల్ షాపులో గర్భ నిరోధక మాత్రలు కొనుగోలు చేసి శనివారం రాత్రి రేణుక వేసుకుంది. మాత్రలు వేసుకున్న కొద్ది సమయంలోనే అధికంగా రక్తస్రావం కావడంతో చికిత్స నిమిత్తం పట్టణంలోని బస్టాండ్ ఎదురుగా ఉన్న ప్రైవేటు దవాఖానకు తీసుకువచ్చారు. అక్కడ వైద్యులు చికిత్స చేసి మెరుగైన వైద్యసేవలకు సిద్దిపేటకు రెఫర్ చేయడంతో బంధువులు సిద్దిపేట ఏరియా దవాఖానకు తరలించారు. అప్పటికే ఆమె పరిస్థితి విషమంగా మారడంతో చికిత్స పొందుతున్న క్రమంలో రేణుక మృత్యువాతపడింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు చేర్యాల పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కొడుకు కోసం గర్భం దాల్చిన రేణుక కుమార్తె పుడుతుందని తెలిసి గర్భనిరోధక మాత్రలు వేసుకోవడంతో వికటించి మృతి చెందిందని గ్రామస్తులు చెబుతున్నారు.

# ఏషియన్ గేమ్స్‌లో నందినికి కాంస్యం

సంగారెడ్డి అక్టోబర్ 1(నమస్తే తెలంగాణ): చైనాలోని హాంగ్జులో జరుగుతున్న ఏషియా గేమ్స్‌లో సంగారెడ్డి జిల్లాకు చెందిన గురుకుల విద్యార్థి నందిని కాంస్య పతకం సాధించి జిల్లాకు వన్నె తీసుకువచ్చింది. ఇందులో తెలంగాణ నుంచి మొట్టమొదటి పతకం సాధించిన నందినిపై ప్రశంసల జల్లు కురుస్తున్నది. రాష్ట్ర యువ స్ప్రింటర్‌గా పేరొందిన నందిని అగసర సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం బుధేరా చౌరస్తాలోని తెలంగాణ గురుకుల మహిళా డిగ్రీ రెసిడెన్షియల్ కాలేజీలో బీబీఏ రెండో సంవత్సరం చదువుతున్నది. భారతదేశం తరపున అథ్లెటిక్స్ విభాగంలో ఏషియా గేమ్స్‌లో పాల్గొన్న నందిని ఆదివారం జరిగిన 800 మీటర్ల హెప్టాథ్లాన్‌లో 27 పాయింట్లు సాధించి కాంస్య పతకం సొంతం చేసుకుంది. నందిని భారతదేశానికి 49వ పతకం సాధించి పెట్టింది. నందినికి అథ్లెట్‌గా అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్రస్థాయిలో గుర్తింపు ఉంది. అథ్లెటిక్స్ పోటీల్లో పలు పతకాలను సొంతం చేసుకుంది. కొలంబియాలో జరిగిన వరల్డ్ అండర్ 20 అథ్లెటిక్స్‌లో 100 మీటర్ల దూరాన్ని 13.34 సెకన్లలో పూర్తి చేసి మెడల్‌ను సాధించింది. ఇటీవల జరిగిన జాతీయ ఓపెన్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్‌లో నందిని స్వర్ణ పథకం సాధించింది. అలాగే ఛత్తీస్‌ఘడ్‌లో జరిగిన అండర్ 23 మహిళల చాంపియన్ షిప్ పోటీల్లో 100 మీటర్ల హర్డిల్స్‌లో స్వర్ణ పతకం గెలిచింది. చదువుకుంటూనే అథ్లెటిక్స్‌లో 11గోల్డ్, 7 సిల్వర్, 6 బ్రాంజ్ మెడల్స్‌ను సాధించి తెలంగాణకు గుర్తింపు తీసుకువచ్చింది. ఏషియా గేమ్స్‌లో కాంస్య పతకం సాధించటంతో అందరూ అభినందిస్తున్నారు.

# జర్నలిస్టులకు రైల్వే పాసులు ఇవ్వాలి

రామాయంపేట, అక్టోబర్ 1: కేంద్ర ప్రభుత్వం మీడియా జర్నలిస్టులకు రైల్వే పాసులతోపాటు స్వేచ్ఛగా తిరిగేందుకు రక్షణ కల్పించాలని రాష్ట్ర టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గసభ్యుడు డీజీ శ్రీనివాస్ శర్మ కోరారు. ఆదివారం రామాయంపేట మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. రోజురోజుకూ కొంత మంది వ్యక్తులు పనిగట్టుకొని మిడియా జర్నలిస్టులపై దాడులకు దిగుతున్నారని, వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అడ్డుకట్ట వేయాలన్నారు. సోమవారం మెదక్ జిల్లా కేంద్రంలో జరిగే ఆందోళనను విజయవంతం చేయాలని కోరారు. కలెక్టర్ ద్వారా జారీ చేయబడ్డ అక్రిడిటేషన్ కార్డులపై తక్షణమే రైల్వే పాసులను ఎలాంటి ఆంక్షలు లేకుండా జారీ చేయాలని డిమాండ్ చేశారు.

# సిద్ధేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

ఝరాసంగం, అక్టోబర్ 1: ఝరాసంగం మండలం పొట్‌పల్లి గ్రామ శివారులోని సిద్ధేశ్వరస్వామి ఆలయంలో ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నరోత్తం ఆదివారం జరిగిన పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామంలోని బీఆర్ఎస్ నాయకులు ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌ను పూలమాల, శాలువతో సన్మానించి స్వాగతం పలికారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పండరి, ఝరాసంగం సర్పంచ్ జగదీశ్వర్, కేతకీ ఆలయ మాజీ చైర్మన్ హన్మన్న పాటిల్, నర్సిములు, శ్రీనివాస్, నాగన్న, మాణిక్, రాములు, సిద్దన్న పాటిల్ పాల్గొన్నారు.


ప్రత్యేక పూజల్లో నరోత్తం, తదితరులు

# కాంగ్రెస్‌కు బిగ్ షాక్!

- కాంగ్రెస్‌కు బైబై చెప్పిన డీసీసీ అధ్యక్షుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి
- మెదక్ కాంగ్రెస్‌లో మైనంపల్లి చిచ్చు!
- గందరగోళంలో క్యాడర్
- మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాల్లో అయోమయం



మెదక్, అక్టోబర్ 1 (నమస్తే తెలంగాణ): మెదక్ జిల్లాలో ఉన్న రెండు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ నేతల మధ్య ఐక్యత లేక కింది స్థాయి నేతలు, కార్యకర్తలు అయోమయానికి గురవుతున్నారు. దీంతో కాంగ్రెస్ క్యాడర్‌లో గందరగోళం నెలకొంది. తాజాగా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కంఠారెడ్డి తిరుపతి రెడ్డి పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి, డీసీసీ పదవికి రాజీనామా చేశారు. దీంతో కాంగ్రెస్ కార్యకర్తలు అయోమయానికి గురవుతున్నారు. మెదక్ నియోజకవర్గంలో డీసీసీ జిల్లా అధ్యక్షుడు కంఠారెడ్డి తిరుపతి రెడ్డి, పీసీసీ అధికార ప్రతినిధి మ్యాడం బాలకృష్ణ మధ్య సయోధ్య లేకపోవడంతో నియోజకవర్గంలో ఎవరి కార్యక్రమాలు వారే చేస్తున్నారు. ఈ మధ్యకాలంలో భారత్ జోడో యాత్ర ఏడాది పూర్తయిన సందర్భంగా మెదక్‌లో జరిగిన కార్యక్రమంలో ఇరువర్గాలు గొడవలకు దిగాయి. దీంతో మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్ రెడ్డి ఇరువర్గాలను నచ్చజెప్పడంతో కార్యకర్తలు సద్దుమణిగారు. అంతేకాకుండా కంఠారెడ్డి తిరుపతిరెడ్డి, మ్యాడం బాలకృష్ణ వేర్వేరుగా పార్టీ కార్యక్రమాలు నిర్వహించడంతో కార్యకర్తలు అయోమయానికి గురవుతున్నారు. నర్సాపూర్ నియోజకవర్గంలో కూడా కాంగ్రెస్‌కు అయోమయ పరిస్థితే ఉంది. కేడర్ అంతా ఒక వైపు ఉంటే నేతలు మాత్రం నలువైపులా వెళ్తున్నారు. దీంతో కార్యకర్తలు ఎటు వెళ్లాలో తెలియక అయోమయానికి గురవుతున్నారు.

**నియోజకవర్గానికి నలుగురు లీడర్లు**

మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాల్లో పటిష్టమైన నేత లేరన్న వాదనలు ఉన్నాయి. కానీ, ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో నేనంటే నేను అంటూ రంగంలో నలుగురు దిగారు. ఎవరికి వారుగా సభలు, సమావేశాలు నిర్వహిస్తుండడంతో కార్యకర్తలు అయోమయానికి గురవుతున్నారు. మెదక్‌లో డీసీసీ అధ్యక్షుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి, పీసీసీ అధికార ప్రతినిధి మ్యాడం బాలకృష్ణ, పీసీసీ సభ్యుడు చౌదరి సుప్రభాత్‌రావు, మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి కాంగ్రెస్‌లో ఉన్నారు. ఇందులో కంఠారెడ్డి తిరుపతిరెడ్డి, మ్యాడం బాలకృష్ణల మధ్య గ్రూపులు ఉన్నాయి. ఇటీవల భారత్ జోడో యాత్ర సందర్భంగా డీసీసీ అధ్యక్షుడి ఫొటో లేని కారణంగా మ్యాడం బాలకృష్ణ వర్గీయుల మధ్య ఘర్షణ చోటు చేసుకున్నది. నర్సాపూర్‌లో మాజీ పీసీసీ అధికార ప్రతినిధి ఆంజనేయులుగౌడ్, గాలి అనిల్‌కుమార్, ఆవుల రాజిరెడ్డి, సోమన్నగారి రవీందర్‌రెడ్డి ఉండగా, ఇటీవల నేతల మధ్య ఫ్లెక్సీ వార్ జరిగింది. ఒక నేత ఏర్పాటు చేసే ఫ్లెక్సీలో మరో నేత ఫొటో పెట్టడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఎవరికి వారుగా గ్రూప్‌లుగా మారడంతో నియోజకవర్గంలో కాంగ్రెస్‌లో గందరగోళంగా మారింది.

**కాంగ్రెస్‌లో ప్రజాబలం ఉన్న నేత లేరు!**

మెదక్ జిల్లా కాగ్రెస్‌లో ప్రజా బలం ఉన్న నేతలు లేరు. జిల్లాలో డీసీసీ అధ్యక్షుడు కంఠారెడ్డి, మ్యాడం బాలకృష్ణతో పాటు మరికొంత మంది నాయకులు ఉన్నా అందులో ప్రజా బలం ఉన్న నేతలు లేరన్న అభిప్రాయం కార్యకర్తల్లో వ్యక్తమవుతోంది. గతంలో కంఠారెడ్డి తిరుపతిరెడ్డి కాంగ్రెస్‌లో ఉత్సాహంగా పనిచేస్తున్న సందర్భంలో మ్యాడం బాలకృష్ణ అడ్డంకులు సృష్టించారన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో కొన్ని రోజులుగా ఇద్దరి మధ్య సయోధ్య కుదరలేదు. మెదక్ అసెంబ్లీ టిక్కెట్ ఆశించిన కంఠారెడ్డి తిరుపతిరెడ్డికి మైనంపల్లి హన్మంతరావు, తనయుడు రోహిత్ కాంగ్రెస్‌లో చేరడంతో కంఠారెడ్డి తిరుపతిరెడ్డి రాజీనామా చేశారు.

**అయోమయంలో కాంగ్రెస్ కార్యకర్తలు**

మెదక్ జిల్లా కాంగ్రెస్‌లో ఇప్పటికే గందరగోళం ఉంది. నేతల మధ్య సయోధ్య లేకపోవడంతో కార్యకర్తలు అయోమయంలో పడుతున్నారు. జిల్లాలో కాంగ్రెస్‌కు గట్టి నమ్మకంతో పనిచేసిన డీసీసీ అధ్యక్షుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి పార్టీకి, పదవికి రాజీనామా చేశారు. దీంతో కార్యకర్తలు ఎటు వెళ్లాలో తెలియక ఇబ్బందులు పడుతున్నారు. కాంగ్రెస్‌లో మైనంపల్లి ఎంట్రీతో మెదక్‌లో ఏం జరుగుతుందో వేచి చూడాలి.

# ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం

- సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి

హుస్నాబాద్, అక్టోబర్ 1: రోజురోజుకూ కనుమరుగవుతున్న ప్రజాస్వామ్య విలువలను కాపాడుకోవడానికి ప్రజలు ఐక్య పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. ఆదివారం హుస్నాబాద్‌లోని అనభేరి సింగిరెడ్డి స్మారక భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదల గురించి ఆలోచించే వారు కరువయ్యారని, పేదల పక్షాల పోరాటాలు చేసే వామపక్ష పార్టీలు ఆటుపోట్లు ఎదుర్కోవలసి వస్తున్నదన్నారు. ప్రజల్లో చైతన్యం వచ్చి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోకుంటే రాబోయే రోజుల్లో అణచివేతకు గురయ్యే ప్రమాదం ఉన్నదన్నారు. అర్హులకు సంక్షేమ పథకాలు అందడం లేదని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. ప్రశ్నించే గొంతుకలను ప్రజలు నిర్లక్ష్యం చేస్తున్నందుకే ఎన్నికల్లో ధనవంతులు గెలిచి వారి స్వప్రయోజనాల కోసమే పనిచేస్తున్నారు తప్పా పేదల అభివృద్ధిని కాంక్షించడం లేదన్నారు. సీపీఐ పేదల ప్రజల పక్షాన నిలబడి పోరాటాలకు సిద్ధమవుతున్నదని, ఇందుకు ప్రజలందరూ కలిసిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు గడిపె మల్లేశ్, ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ధర్మేంద్ర, నాయకులు అనిల్‌కుమార్, లక్ష్మణ్, శంకర్, వినేశ్, పద్మ, శ్రీనివాస్, సంజీవరెడ్డి, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# దుబ్బాకలో బీజేపీ ప్రలోభాలకు తెర

- సోషల్ మీడియాలో ఫొటోలు హల్‌చల్
- ఎమ్మెల్యే తీరును ఎండగట్టిన బీఆర్ఎస్ శ్రేణులు

దుబ్బాక టౌన్, అక్టోబర్ 1: దుబ్బాక నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఎమ్మెల్యే రఘునందన్‌రావు ఫొటోలతో కూడిన గొడుగులు, చీరలు, జూట్ బ్యాగులు పంపిణీ చేసిన దృశ్యాలు ఆదివారం సోషల్ మీడియాలో హల్‌చల్ చేశాయి. నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో బీజేపీ శ్రేణులు బహిరంగంగా ఇంటింటికీ తిరుగుతూ గొడుగులు, చీరలు పంపిణీ చేశారని, రఘునందన్‌రావు ప్రలోభాలు షురూ చేశారంటూ బీఆర్ఎస్ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆటోల్లో గ్రామాల్లోకి బహిరంగంగా తీసుకువచ్చిన వస్తువులు పెద్దఎత్తున పంపిణీ చేసిన దృశ్యాలు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి. వీటిని తీసుకుంటున్న ప్రజలు ప్యాకేజీల్లో ఇవే ఉన్నాయా? డబ్బులు, మరేమైనా వస్తువులు ఉన్నాయా? అంటూ కామెంట్స్ వస్తున్నాయన్నారు. వీటిపై ఎమ్మెల్యే రఘునందన్‌రావు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ శ్రేణులు సోషల్‌మీడియా వేదికగా తీవ్రంగా ఫైర్ అయ్యారు. 'ఎడ్లు, నాగలి పోయే.. చీర, గొడుగు ముందుకు వచ్చే..! రఘునందన్ మూడేండ్లుగా నిన్ను నమ్మి ఓట్లు వేసి గెలిపిస్తే గిదేందంటూ వ్యంగ్యంగా విమర్శలు చేస్తున్నారు. ఎన్నికలకు ముందే రఘునందన్‌రావు ప్రలోభాలకు తెరలేపారని, ఎంత చేసినా ప్రజలు నమ్మరని, రఘునందర్‌రావును చిత్తుగా ఓడిస్తారంటూ బీఆర్ఎస్ శ్రేణులు పెద్దఎత్తున సోషల్‌మీడియాలో విమర్శలు చేశారు.


ఎమ్మెల్యే రఘునందన్‌రావు ఫొటోలతో గొడుగులు, చీరలు, జ్యూట్‌బ్యాగుల పంపిణీ

# స్వచ్ఛతకు సమయమివ్వాలి

కంది, అక్టోబర్ 1: స్వచ్ఛతకు సమయం కేటాయించి గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకొని తలపెట్టిన స్వచ్ఛతహీ సేవా కార్యక్రమాన్ని ఆదివారం కంది మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో నిర్వహించారు. చిమ్నాపూర్ గ్రామంలో నిర్వహించిన స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రమదానం చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాధ్యతగా తమ గ్రామాల పరిశుభ్రతకు సమయం కేటాయించాలని సూచించారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విశ్వప్రసాద్, సర్పంచ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

**వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాలలో..**

కందిలోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ ఇంజినీరింగ్ కళాశాలలో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా కళాశాల పరిసర ప్రాంతాల్లో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ బీబీఎస్ ప్రసాద్, ఎన్ఎస్ఎస్ వలింటీర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నేడు పట్టాల పంపిణీ

రేగోడ్, అక్టోబర్ 1: మండల పరిధిలోని దోసపల్లి, తాటపల్లి, లింగంపల్లి, మర్పల్లి గ్రామంలో సోమవారం పలు అభివృద్ధి కార్యక్రమాలను అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ ప్రారంభిస్తారని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బుచ్చయ్య ఆదివారం ప్రకటనలో తెలిపారు. దోసపల్లిలో రూ.15 లక్షలతో సీసీ రోడ్డు పనులు ప్రారంభోత్సవం, బతుకమ్మ చీరల పంపిణీ, పేదలకు ఇండ్ల పట్టాల పంపిణీ, తాట్‌పల్లి గ్రామ పంచాయతీ భవనం ప్రారంభం, లింగంపల్లిలో పీహెచ్‌సీ భవవానికి శంకుస్థాపన, ఇనాం పట్టాల పంపిణీ, వర్షానికి కూలిన ఇండ్లకు సంబంధించి చెక్కులు అందించనున్నట్లు తెలిపారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ గ్రామాల అధ్యక్షులు, కార్యకర్తలు తరలివచ్చి కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. ఆయన వెంట పార్టీ మండల ప్రధాన కార్యదర్శి రమేశ్ ఉన్నారు.

# రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య

రామాయంపేట, అక్టోబర్ 1: మనస్తాపానికి గురై ఓ యువకుడు రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ఆదివారం అక్కన్నపేట రైల్వే ట్రాక్‌పై చోటుచేసుకున్నది. కామారెడ్డి పోలీసుల కథనం ప్రకారం.. అక్కన్నపేట గ్రామానికి చెందిన జంగం సాగర్(27) కొద్ది రోజులుగా పెళ్లి కావడం లేదంటూ తీవ్ర మనస్తాపానికి గురై రైలు కింద పడి ఆత్యహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు పంచనామా నిర్వహించి మృతదేహాన్ని కామారెడ్డి ప్రభుత్వ ఏరియా దవాఖాన మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.